సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 26 । జనవరి । 2025



రెపరెపలాడుతున్న జాతీయ జెండా

మరిన్ని వివరాలు 8లో ▶

నింగినంటిన మువ్వన్నెలు

ఆదిలాబాద్: భారత ఖ్యాతి నలువైపులా విస్తరిస్తుంది అన్నట్లు ఈ భారీ త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. పట్టణం నడిబొడ్డున 150 అడుగుల మూడు రంగుల జెండా సగర్వంగా నిలబడి ప్రతి ఒక్కరి హృదయాన్ని తనవైపు ఆకర్షిస్తోంది. దేశభక్తిని గుండెల నిండా నింపుకున్న స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాన్ని, స్ఫూర్తిని చాటుతూ జిల్లా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం నిలుపుకుంటోంది. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న ఈ భారీ పతాకంను స్థానిక ఎన్టీటీ బిజినెస్ డేటా సొల్యూషన్స్ ఐటీ కంపెనీ ఏర్పాటు చేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.27 లక్షల వ్యయంతో 2023లో ఏర్పాటు చేయగా అప్పటి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆగస్టు 15న ఆవిష్కరించారు. పట్టణవాసులు, విద్యార్థులు, జిల్లాకు వచ్చే పర్యాటకులు ఈ భారీ జెండా వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ జాతీయ భావం చాటుతున్నారు.

నిత్య జనగణమన



జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్, ప్రజలు(ఫైల్)

బెల్లంపల్లి: ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో బెల్లంపల్లిలో జనహిత సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య జనగణమన గీతాలాపన నేటితో సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది. 2024 జనవరి 26న ఎమ్మెల్యే గడ్డం వినోద్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజు ఉదయం 8గంటల ప్రాంతంలో జనగణమన గీతాలాపన నిర్విఘ్నంగా సాగుతోంది. పాత బస్టాండ్ చౌరస్తా, బజారు ఏరియా, అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మైక్‌ల ద్వారా వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి జాతీయ గీతాన్ని ప్రారంభించగానే రోడ్డుపై వెళ్తున్న అన్ని వర్గాల ప్రజలు ఒక్కసారిగా నిలబడి గీతాలాపన పూర్తయ్యేదాకా మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేస్తూ జాతీయ భావాన్ని చాటుతున్నారు. కూరగాయల వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, రోజువారీ కూలీలు, షాపుల యజమానులు, ఆర్టీసీ డ్రైవర్లు, వాహనదారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వ శాఖల అధికారులు సంపూర్ణ సహకారం ఇస్తుండటంతో నిరాటంకంగా కొనసాగుతోంది. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్ పట్టుదలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

- మహిళా శక్తితో ముందడుగు
- సాగులో 'సేంద్రియ' బాట
- మాతృభూమి సేవలో ప్రణమిల్లుతున్న పల్లెలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రగతి బాట పడుతోంది. రాజ్యాంగ స్ఫూర్తితో ముందడుగు వేస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధి రాగం వినిపిస్తోంది. దేశసేవలోనూ తరిస్తోంది. ఇందులో పల్లె, పట్టణం భాగస్వామ్యం అవుతున్నాయి. స్వశక్తితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తుండగా.. యువత మాతృభూమి రక్షణకు సై అంటోంది. ఆరోగ్య సేద్యంతో అన్నదాత 'ప్రకృతి' ఒడిలో సేదతీరుతున్నాడు. నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రాజ్యాంగ స్ఫూర్తి.. ప్రగతి బాట

పచ్చళ్లతో ఉపాధి



చేప పచ్చడి తయారు చేస్తున్న మహిళలు

కడెం: మండల కేంద్రానికి చెందిన 50 మంది మహిళలు గతేడాది ఫిబ్రవరిలో ఈడీఐఐ యాక్సెంచర్ ద్వారా 26 రోజుల పాటు చేప, రొయ్యల పచ్చడి తయారీపై శిక్షణ పొందారు. వీరిలో 30 మంది తయారీని ప్రారంభించారు. ఇందిర మహిళా శక్తి పథకం,ఈడీఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎఫ్‌సీని ప్రారంభించారు. చేపలు, రొయ్యలు, చికెన్ పచ్చళ్లు తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చేపల పచ్చడి కేజీ రూ.800, రొయ్యల పచ్చడి కేజీ రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. అలాగే స్థానికంగా లభ్యమయ్యే ఎండు రొయ్యలు, ఎండుచేపలను సైతం విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇప్పటివరకు 200కిలోల వరకు చేపల పచ్చళ్లు విక్రయించారు.

నాణ్యమైన పచ్చళ్లు



పచ్చళ్ల తయారీలో నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నాం. కడెం ప్రాజెక్ట్‌లో దొరికే తాజా చేపలు, రొయ్యలతో పచ్చళ్లు తయారు చేస్తున్నాం. మా సీఎఫ్‌సీలో పచ్చళ్లతో పాటుగా ఎండు చేపలు, రొయ్యలు లభిస్తాయి.

– మామిడాల పద్మ, కడెం



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంటీన్

సంఘంలో చేరి... స్వయం శక్తిగా ఎదిగి

కైలాస్‌నగర్: జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన గంగోత్రి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కొప్పుల సరోజ తొలుత వ్యవసాయ కూలి. చేను పనులు చేస్తూనే స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. తనలాంటి మరో తొమ్మిది మందిని అందులో చేర్పించారు. వారితో కలిసి పొదుపు ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు అందుకున్న వారంతా వాటిని సద్వినియోగం చేసుకున్నారు. తొలుత ఏదైనా వ్యాపారం చేపట్టాలని భావించారు. ఈ క్రమంలో కొద్ది రోజుల పాటు మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చిన్న హోటల్ నిర్వహించారు. డీఆర్డీఏ పరిధిలో నిర్వహించే సమావేశాలకు భోజనం సరఫరా చేస్తూ అధికారుల దృష్టిని ఆకర్షించారు.

అవకాశం అందిపుచ్చుకుని..

హోటల్ రంగంలో రాణిస్తున్న సరోజను గమనించిన డీఆర్డీఏ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను వారి సంఘానికి మంజూరు చేశారు. ఇందుకోసం రూ.5లక్షల బ్యాంకు రుణం కూడా మంజూరు చేశారు. వీటితో ఆమె జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాంటీన్ షురూ చేశారు. ఐదు నెలలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రుచి, శుచితో కూడిన అన్ని రకాల ఆహార పదార్థాలను ఇందులో విక్రయిస్తుండడంతో రోగుల సహాయకులు, వైద్యులు క్యూ కడుతున్నారు. గిరాకీ పెరుగుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తున్నారు. తనతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు సరోజ.

అధికారుల ప్రోత్సాహంతో..



అధికారుల ప్రోత్సాహంతో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఇక్కడ ఐదు నెలల క్రితం ప్రారంభించాం. నాతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నా. పేషెంట్లకు ప్రభుత్వపరంగా అందించే భోజన టెండర్లను అప్పగిస్తే మరికొంత మందికి ఉపాధితో పాటు ఆర్థికంగా లబ్ధి చేకూరే అవకాశముంటుంది. విషయాన్ని ఇటీవల మంత్రి సీతక్కకు కూడా విన్నవించాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు.

– కొప్పుల సరోజ, క్యాంటీన్ నిర్వాహకురాలు

విస్తరాకుల పరిశ్రమతో విజయం





మిషన్‌పై మోదుగు ఆకులను కట్ చేస్తున్న శ్రీలత

భీమారం: మండల కేంద్రంలోని మాదన్న గూడేనికి చెందిన ఆదివాసీ మహిళ శ్రీలత మోదుగు ఆకులతో విస్తరాకుల తయారీ కేంద్రం నిర్వహిస్తూ సక్సెస్ బాటలో పయనిస్తోంది. శ్రీరామ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన ఈమె 2018లో రూ.2లక్షలు రుణం తీసుకుని విస్తరాకుల పరిశ్రమను నెలకొల్పింది. శ్రీలత తన తోటి మహిళలతో సమీప అడవికి వెళ్లి మోదుకు ఆకులను సేకరించి తెస్తోంది. స్వతహాగా విస్తరాకుల ను తయారు చేసి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు కూడా సరఫరా చేస్తోంది. ప్లాస్టిక్ రహితం కోసం కృషి చేస్తోంది. గుడిసెలో నివసించే తాను స్వయం సహాయక సంఘం ద్వారా రుణం పొంది వ్యాపారంలో రాణించానని, ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా ఇతర మహిళలకూ ఉపాధి కల్పిస్తున్నట్లు చెబుతోంది.

పెరటి కోళ్ల పెంపకంలో రాజమ్మ..



పెరటి కోళ్లఫాం వద్ద రాజమ్మ

జైపూర్: చదువు లేకున్నా సొంత తెలివితో పెరటి కోళ్ల పెంపకం చేపడుతూ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఎగూడ రాజమ్మ ఆర్థికంగా రాణిస్తోంది. ఇంటి సమీపంలోనే ఉపాధిహామీ కింద షెడ్డు నిర్మించుకుని బ్యాచ్‌కు 1,500 కోడి పిల్లలను పెంచి కిలో, రెండు కిలోలు కాగానే స్థానిక వ్యాపారులకు విక్రయిస్తోంది. ఖర్చులు పోను నెలకు రూ.50వేలకు పైగా సంపాదిస్తోంది. మరోవైపు కులవృత్తిని కూడా కొనసాగిస్తోంది. కుండలు తయారు చేస్తూ జీవనం సాగిస్తోంది. భవిష్యత్‌లో పెరటి కోళ్ల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెబుతోంది.

ఆదర్శంగా సరస్వతీ సమాఖ్య



సమావేశంలో పాల్గొన్న మహిళలు

భైంసా: డివిజన్‌లోని ముధోల్ మండల సరస్వతీ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తోంది. 2004లో ఏర్పాటైన ఈ సమాఖ్యలో 25 గ్రామైక్యసంఘాలు, 794 స్వయం సహాయక సంఘాలున్నాయి. 8,636 మంది సభ్యులు ఉన్నారు. ఏటా మహిళలకు రుణాలు ఇచ్చి రికవరీ చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 2,133 మంది సభ్యులకు రూ.14కోట్ల 45లక్షల 3,642 రుణం తీసుకున్నారు. స్త్రీనిధి ద్వారా రూ.36,49,200 పొదుపు చేశారు. జిల్లాలోనే ఈ సంఘం పొదుపులో ఆదర్శంగా నిలిచింది.

కిస్తీలు చెల్లిస్తూ...

ఈ సమాఖ్య పరిధిలోని గ్రామైక్య సంఘాలు సమావేశాలు నిర్వహించి అందులో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు కావాల్సిన చిన్నచిన్న పరిశ్రమలకు రుణాలు ఇస్తున్నారు. పూర్తిస్థాయిలో చెల్లింపులు ఉండడంతో యేటా రూ.9 నుంచి రూ.10 కోట్ల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నారు. చెల్లింపులో వెనుకబడకుండా జిల్లాలోనే ఈ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తుంది.

వరుసగా మూడేళ్లు...

- 2015–16 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధిలో 587 మంది సభ్యులకు రూ.3 కోట్ల 21 లక్షల 73,881 రుణం ఇచ్చారు. వందశాతం రికవరీతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ సంఘం అవార్డు అందుకుంది. అప్పటి ప్రభుత్వం ఈ సంఘానికి మహిళ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందించారు.
- 2016–17 ఆర్థిక సంవత్సరంలో 508 మంది సభ్యులకు రూ. 3 కోట్ల 51 లక్షల 21,368 రుణం ఇచ్చి వందశాతం రికవరీచేశారు. నిర్మల్ జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిన ఈ సంఘానికి ఉత్తమ అవార్డు అందించారు.
- 2017–18 ఆర్థిక సంవత్సరంలో 589 మంది సభ్యులకు రూ.4 కోట్ల 23 లక్షల 25,426 రుణాలు ఇచ్చారు. వందశాతం రికవరీతో వరుసగా మూడవసారి ఉత్తమ అవార్డు దక్కింది.

సద్వినియోగం చేసుకుంటున్నాం



సరస్వతీ సమాఖ్య పరిధిలోని గ్రామైక్య సంఘాలకు సమావేశాలు నిర్వహిస్తాం. గ్రామాల్లో ఉపాధి కోసం కావాల్సిన రుణాలను అందిస్తున్నాం. పిండిగిర్నీ, కిరాణ దుకాణం, హార్డ్‌వేర్‌షాపులు ఏర్పాటు చేసుకున్నారు. రుణాల కిస్తీలు చెల్లిస్తున్నారు. సమష్టి కృషితోనే రుణ రికవరీ జరుగుతోంది.

– దమ్మ జైశీల, సరస్వతీ సమాఖ్య అధ్యక్షురాలు

తేనె శుద్ధితో లాభాలు



వాంకిడిలోని తేనెశుద్ధి కేంద్రం

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలంలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి 2022లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తేనె శుద్ధి యంత్రాలు అందించారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కర్మాగారాన్ని ఏర్పాటు చేసుకుని మహిళలు లాభాలు గడిస్తున్నారు. మండలం సమాఖ్యలో మొత్తం 32 వీవో సంఘాలు ఉన్నాయి. ప్రారంభంలో మార్కెటింగ్‌పై అవగాహన లేక తడబడి 2023లో తేనె శుద్ధిని నిలిపివేశారు. ఆ తర్వాత తేనె సేకరణ, మార్కెటింగ్‌పై దృష్టి సారించారు. గత నష్టాలను అధిగమించి ఇప్పటివరకు రూ.30 వేల వరకు లాభాలు రాబట్టినట్లు ఐకేపీ సిబ్బంది వెల్లడించారు. ప్రస్తుతం చెట్లపై సహజంగా లభించే తేనె కొనుగోలు చేసి శుద్ధి చేస్తున్నారు. 'నేచర్ హనీ' బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. కల్తీ లేకుండా నాణ్యతతో ఉండటంతో మండలానికి వచ్చే ఉన్నతాధికారులు, వివిధ గ్రామాల ప్రజలు తేనె కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

విభిన్న పద్ధతుల్లో సాగు



కొడుకుతో కలిసి ఎరువు చల్లుతున్న సుగుణ

దండేపల్లి: ఇటీవలి కాలంలో చాలామంది రైతులు వరి, పత్తి, మొక్క జొన్న మాత్రమే సాగు చేస్తున్నారు. మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ–నారాయణ దంపతులు అమెరికాలో ఉండే పెద్దకొడుకు మురళి ప్రోత్సాహం, మరో ఇద్దరు కుమారులు ప్రశాంత్, పవన్ సహకారంతో సాగులో విభిన్న పద్ధతులు పాటిస్తున్నారు. వివిధ రకాల పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2016 నుంచి వీరు పంటసాగులో నూతన పద్ధతులు పాటిస్తున్నారు. వరిలో సాధారణ రకాలను పక్కన పెట్టి దేశవాళీ వంగడాలైన నల్లవరి, తెల్లవరి, మొక్కజొన్న, నువ్వులు, పెసలు సాగు చేస్తున్నారు. వీటన్నింటికీ సేంద్రియ ఎరువులే వినియోగిస్తారు. పంటలు పండించడంతో పాటు వ్యవసాయ అనుబంధంగా పొలం వద్ద చేపల చెరువు ఏర్పాటు చేసి అందులో చేపలూ పెంచుతున్నారు.

'ఆరోగ్య' సేద్యం



ఆదిలాబాద్ నాచురల్స్‌లో ఉంచిన కూరగాయలు

గుడిహత్నూర్: రసాయన ఎరువుల సాగుతో నష్టాలను చవిచూసిన మండలంలోని తోషం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పస్తాపురే రవీందర్ ఎనిమిదేళ్లుగా సేంద్రియ బాట పట్టాడు. తనకున్న మూడెకరాల్లో ప్రకృతి సేద్యం ద్వారా కూరగాయలు పండిస్తూ తనతో పాటు వినియోగదారులకు ఆరోగ్యం పంచుతున్నాడు.

కష్టాలను అధిగమించి..

గతంలో సేంద్రియ కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళితే ధర మామూలు వాటికి పలికిన విధంగానే ఉండేది. దిగుబడి తక్కువ, శ్రమ ఎక్కువ కావడంతో కొంత నిరాశ చెందాడు. అయితే సంకల్పం మాత్రం వీడలేదు. తనతో పాటు మరికొందరికి ఈ సేద్యంపై అవగాహన కల్పించాడు. వారందరినీ లాభాల బాట పట్టేలా ఏకతాటిపై తీసుకువచ్చాడు.

కలెక్టర్ చొరవ.. ప్రకృతి ఫుడ్స్ ఆవిర్భావం

జిల్లాలోని సేంద్రియ రైతులంతా ఏకమై గతంలో పనిచేసిన కలెక్టర్ దివ్యా దేవరాజన్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ క్రమంలో ఆమె సేంద్రియ ఉత్పత్తుల ఆవశ్యకతను గుర్తించారు. ఐదేళ్ల క్రితం జిల్లా కేంద్రం నడిబొడ్డున కలెక్టరేట్ చౌక్ వద్ద ప్రత్యేక స్థలం కేటాయించారు. సేంద్రియ ఉత్పత్తులు విక్రయించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం రూ.29 లక్షలు మంజూరు చేశారు. దీంతో వీరు 'ప్రకృతి ఫుడ్స్' పేరిట సహకార సంఘంగా మారారు. తమ ఉత్పత్తులను 'ఆదిలాబాద్ నాచురల్స్' స్టోర్‌లో విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ రైతులు సాగు చేసిన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడికి విక్రయించే వెసులుబాటు ఉంది. దీంతో దళారుల ప్రమేయం లేకుండా వారికి గిట్టుబాటు ధర దక్కుతోంది.

అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ సాగు ఆవశ్యకతపై జిల్లాలోని ఇతర రైతులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. సాగు విస్తీర్ణం పెంచేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. భావి తరాలకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రజలు సైతం సేంద్రియ ఉత్పత్తులను ఆదరిస్తున్నారు.

– పస్తాపురే రవీందర్, ప్రకృతి ఫుడ్స్ చైర్మన్, సేంద్రియ రైతు

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

కైలాస్‌నగర్: గణతంత్ర వేడుకల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. ఈమేరకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేదికకు రంగులు వేసి పూలతో అలకరించారు. ఆదివారం ఉదయం 9గంటలకు కలెక్టర్ రాజర్షి షా జాతీయ పతాకం ఆవిష్కరించనున్నారు.

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు

కైలాస్‌నగర్: 2024 సంవత్సరానికి గాను బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు కలెక్టర్ రాజర్షి షా ఎంపికయ్యారు. జిల్లాలో గతేడాది నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించడం, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు గాను ఎన్నికల సంఘం ఈ అవార్డును ప్రకటించింది. రవీంద్రభారతిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకునేందుకు కలెక్టర్ హైదరాబాద్ వెళ్లారు. అయితే సీఎస్‌తో సంక్షేమ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ కారణంగా హుటాహుటిన జిల్లాకు తిరిగి వచ్చారు.

ఓటర్ల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

కైలాస్‌నగర్: దేశ భవిష్యత్తు ఓటర్ల చేతుల్లో ఉందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పలువురు సీనియర్ ఓటర్లను సన్మానించారు. అలాగే వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. అంతకుముందు ఇందిరాప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ఓటరు అవగాహన ర్యాలీని ఎస్పీ గౌస్ ఆలం ప్రారంభించారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ఉట్నూర్‌రూరల్: ఓటు వజ్రాయుధం వంటిందని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీని కేబీ ప్రాంగణం వద్ద ప్రారంభించి మాట్లాడారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్, సీఐ మొగిలి పాల్గొన్నారు.

- నేటి నుంచి నాలుగు సంక్షేమ పథకాలు
- మండలానికో గ్రామం యూనిట్‌గా అమలు
- ఎంపిక చేసిన విలేజ్‌ల జాబితా విడుదల
- పట్టణంలో ఈ రోజు లేనట్లే
- ఒక్కో స్కీంకు ప్రత్యేక అధికారుల నియామకం
- విడతల వారీగా మిగతా గ్రామాలు, వార్డుల్లో..

ప్చ్.. నేడు కొందరికేనట!



సీఎస్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా ఇతర అధికారులు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడుతోంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి సర్వం సిద్ధం చేసింది. ఈ పథకాల పరంగా జిల్లాలో వేలాది మంది తమకు లబ్ధి చేకూరుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తు ఆధారంగానే తమ పేరును పరిగణలోకి తీసుకుంటారని ముందు నుంచి అనుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున తమకు తీపి కబురు అందుతుందని ఆశించారు. అయితే అనుకున్నదొక్కటి.. అయ్యింది మరొకటి అన్నట్లు.. రిపబ్లిక్‌డే రోజున అన్ని గ్రామాలు, వార్డుల్లో సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ మండలం నుంచి ఒక గ్రామం యూనిట్‌గా నేడు పథకాల అమలుకు శ్రీకారం చుడుతున్నారు. అలాగని మిగతా లబ్ధిదారులను విస్మరించారని కాదు.. దశల వారీగా గ్రామ, వార్డులకు క్రమంగా ఇది కొనసాగనున్నట్లుగా తెలుస్తోంది. అయితే దీనిపై కూడా ఇంకా అధికారుల వద్ద స్పష్టత లేదు.

ప్రత్యేక అధికారుల నియామకం

మండలానికో గ్రామం యూనిట్‌గా తీసుకుని నేడు నాలుగు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా 250 నుంచి 400 వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన గ్రామాలను మొదట ప్రాధాన్యత క్రమంలో తీసుకున్నారు. మిగతా స్కీంలను కూడా అదే గ్రామాల్లో అమలు చేయనున్నారు. ఈ మేరకు చేపట్టిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ శనివారం రాత్రి వరకు కొనసాగింది. జాబితా తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇక మండలంలో ఈ నాలుగు పథకాలకు సంబంధించి ఒక్కో స్కీంకు ఒక్కో ప్రత్యేకాధికారితో కమిటీలను నియమిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ మొదలైంది. దీంతో ఆయా పథకాలు అమలు చేసే గ్రామాల్లో ఆగమేఘాలపై ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఇదిలా ఉంటే ఆహార భద్రత కార్డుల కోసం తహసీల్దార్ నేతృత్వంలో, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపీడీవో, రైతు భరోసాకు మండల వ్యవసాయాధికారి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ ఏపీవో ఆధ్వర్యంలో బృందాలను నియమించారు. వీరు ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాను పకడ్బందీగా అమలు చేయాలి.

ప్రారంభోత్సవాలు ఇలా..

ఎంపిక చేసిన గ్రామాల్లో పథకాల ప్రారంభోత్సవానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు ఇటు కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో వీటిని పర్యవేక్షిస్తున్న అధికారుల్లో హడావుడి కనిపించింది. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ఆడియో, వీడియోను కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. మండల ప్రత్యేకాధికారులు ఇన్‌చార్జీలుగా ఈ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. అంతే కాకుండా లబ్ధిదారుల జాబితాను ఒక్కటికి రెండు సార్లు పరిశీలించి అంతిమంగా వందశాతం అర్హులైన వారి జాబితానే ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎంపిక చేసిన గ్రామాలివే....

మండలం	గ్రామం
అదిలాబాద్ రూరల్	పిప్పల్‌దరి
బజార్‌హత్నూర్	అందుగూడ
బేల	దొప్టాల
భీంపూర్	బెల్సారి రాంపూర్
బోథ్	కుచులాపూర్
ఇచ్చోడ	నవేగాం
గాదిగూడ	సావిరి
గుడిహత్నూర్	వైజాపూర్
ఇంద్రవెల్లి	గట్టుపల్లి
జైనథ్	పిప్పర్ వాడ
మావల	వాఘాపూర్
నార్నూర్	బాబేఝరి
నేరడిగొండ	వాంకిడి
సిరికొండ	రిమ్మ
తాంసి	హస్నాపూర్
ఉట్నూర్	మత్తడిగూడ
తలమడుగు	లక్ష్మీపూర్

అర్హులందరికీ లబ్ధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రత్యేకాధికారులను నియమించాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం.

– రాజర్షి షా, కలెక్టర్

జననీ జన్మభూమిశ్చ..

- దేశ రక్షణలో ఉమ్మడి జిల్లా యువత • సైనికులుగా సరిహద్దుల్లో విధులు..
- మాతృభూమి రుణం తీర్చుకుంటున్న ఆర్మీ జవాన్లు



తల్లి, పుట్టిన ఊరు, పుట్టిన దేశం స్వర్గం కన్నా గొప్పవి. సొంత ఊరిలో మనం హాయిగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే కారణం.. సరిహద్దుల్లో భరత మాత రక్షణకు తమ ప్రాణాలు పణంగా పెట్టి గస్తీ కాస్తున్న సైనికులే కారణం. తమ కుటుంబాలను వదిలి దేశ ప్రజల కోసం యుద్ధభూమిలో ఉంటున్నారు. ఎటు నుంచి ఏ ముప్పు వాటిల్లుతుందో తెలియని పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్నారు. యుద్ధభూమిలో ఉంటూ దేశసేవ చేయడానికి ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నుంచే 300లకు పైగా జవాన్లు సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మాతృభూమి రుణం తీర్చుకుంటున్నారు. రానున్న రోజుల్లో అకాడమీ ఏర్పాటు చేయడానికి పలువురు సైనికులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక యువతకు సైనికులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సైనిక పల్లెలపై ప్రత్యేక కథనం.

– బోథ్/ఇచ్చోడ

యువత ముందుకు రావాలి



చెన్నూర్: దేశరక్షణలో నావంతు భాగస్వామ్యం ఉండాలని చిన్ననాటి నుంచి కలలు కన్నా. ఆర్మీకి ఎంపికయ్యా. ఐదేళ్లుగా ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. బార్డర్‌లో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది. ఆర్మీలో పనిచేసేందుకు యువత ముందుకు రావాలి.

– నూకల మహేశ్, బీతాళవాడ, చెన్నూర్

జైజవాన్.. జైకిసాన్..

బోథ్ పట్టణానికి చెందిన రాసం ప్రవీణ్‌కుమార్, మల్లెపూల మహేందర్ సైనికులుగా దేశసేవలో విధులు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయం చేస్తున్నారు. జైజవాన్, జైకిసాన్ నినాదానికి అనుగుణంగా రైతులుగా మారి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

దేశం తరఫున ప్రపంచానికి సేవలు



బర్నాలీ హరిమ్రిదా

చింతలమానెపల్లి: కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన బర్నాలీ హరిమ్రిదా సైనికురాలిగా భారత ఆర్మీలో విధులు నిర్వహిస్తూ ఐక్యరాజ్యసమితి సైన్యానికి ఎంపికైంది. ఐరాస తరఫున ఆఫ్రికా ఖండంలోని కాంగో దేశంలో విధులు నిర్వహిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తోంది. బర్నాలీ అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించి అస్సాం గుర్ఖా రైఫిల్స్‌లో రైఫిల్ వుమెన్‌గా ఎంపికైంది. ఇదే సైన్యంలో పనిచేస్తున్న రవీంద్రనగర్‌కు చెందిన హరిమ్రిదను వివాహం చేసుకుంది. గ్రూప్ కమాండర్‌గా స్థానికులకు సేవలందించడం, అసిస్టెంట్ కమాండ్ అధికారిగా సైనికుల విధులను పర్యవేక్షించడం ఈమె విధులు. దేశం తరఫున ఐక్యరాజ్యసమితి సైన్యంలో పనిచేయడం తనకు గర్వకారణంగా ఉందని ఈసందర్భంగా ఆమె పేర్కొంది.

గర్వంగా ఉంది



బోథ్: పాకిస్తాన్ బార్డర్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. దేశ రక్షణలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది. భారత ప్రజల దీవెనలే మాకు బలం. జవాన్‌గా పనిచేయడం గర్వంగా ఉంది. దేశసేవ చేసేందుకు యువత ముందుకు రావాలి.

– నీలి రాము, సైనికుడు, బోథ్

సంతృప్తిగా ఉంది



దేశానికి సేవ చేయడంలో సంతృప్తిగా ఉంది. దేశ రక్షణ కంటే మనకు ఏదీ ముఖ్యం కాదు. నెలల తరబడి ఇంటికి రాకున్నా కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నట్లుగానే ఉంటోంది. ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నా.

– శ్రీరాం, నర్సాపూర్, ఇచ్చోడ

సేవే లక్ష్యంగా..



దేశానికి సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదు. చిన్ననాటి నుంచి దేశంకోసం పనిచేయాలన్న ఆలోచన ఉండేది. అదే పట్టుదలతో ఐదేళ్ల క్రితం ఆర్మీలో చేరా. ప్రస్తుతం చైనా బార్డర్‌లో లద్దాక్‌లో పనిచేస్తున్నా.

– సతీష్‌కుమార్, మర్లపెల్లి, బోథ్

అదృష్టంగా భావిస్తున్నా



పన్నెండేళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నా. ప్రస్తుతం కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నా. ఎముకలు కొరికే చలిని సైతం తట్టుకుని పనిచేస్తున్నాం. దేశ రక్షణలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా.

– అనిల్, నర్సాపూర్, ఇచ్చోడ

ఒకే కుటుంబం నుంచి ఏడుగురు..

బోథ్ మండల కేంద్రానికి చెందిన కదం భోజారాం, ముకుంద్, శంకర్, నర్సింగ్‌రావు సోదరులు. భోజారాం రెండో కుమారుడు ప్రవీణ్ కుమార్, మూడో కుమారుడు ప్రతాప్ సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ముకుంద్ పెద్ద కుమారుడు సుధాకర్ సైనికునిగా సేవలు అందించి రిటైర్డ్ అయ్యారు. రెండో కుమారుడు కదం మధుకర్, శంకర్ కుమారుడు ప్రశాంత్, నర్సింగ్‌రావు కుమారుడు విజయ్ ప్రస్తుతం సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒకే కుటుంబం నుండి ఏడుగురు జవాన్లుగా దేశ రక్షణ కోసం పాటుపడుతున్నారు.

వీరమరణం పొందిన సతీశ్‌గౌడ్



సతీశ్‌గౌడ్ (ఫైల్)

బోథ్ మండలంలోని మర్లపెల్లికి చెందిన గొడిసెల లింగాగౌడ్ కుమారుడు సతీష్‌గౌడ్ సీఆర్‌పీఎఫ్ జవానుగా విధులు నిర్వహించాడు. 2016లో గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులకు, సీఆర్‌పీఎఫ్ బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో సతీష్ గౌడ్ మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం స్వస్థలం మర్లపెల్లిలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం సతీశ్ వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు.

దేశసేవ చేయడం గర్వంగా ఉంది



2008లో సీఆర్‌పీఎఫ్‌లో సెలెక్ట్ అయ్యా. 18 ఏళ్ల పాటు ఆర్మీలో విధులు నిర్వర్తించా. మరో రెండేళ్లలో రిటైర్డ్ కాబోతున్నా. దేశానికి సేవచేసే అవకాశం రావడం గర్వంగా భావిస్తున్నా. దేశ రక్షణలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– జదాల శంకర్, సైనికుడు, బోథ్

క్లుప్తంగా

13న సామూహిక వివాహాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

నార్నూర్: వచ్చే నెల 13న గాదిగూడ మండలం శివనారా గ్రామంలో గురుదేవ్ సేవాశ్రమ్, సంతోషిమాత సంస్థాన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం గాదిగూడ మండలం శివనారా గ్రామంలో జంగో లింగో దీక్షాధారులతో కలిసి ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ విడుదల చేశారు. పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలకు తక్కువ ఖర్చుతో ఆగ్రం కిషన్ మహరాజ్ చేతుల మీదుగా వివాహాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సంస్థాన్ పెద్దలను కలిసి వచ్చే నెల ఒకటిలోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూగ్నక భీంరావ్, సార్ మేడి తుకారాం, గ్రామస్తులు ఆర్కా యాదగిరి, జూగ్నక వెంకటేష్, చిక్రం గుణవంతరావు, కుడ్మేత నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



రాథోడ్ అర్జున్ మృతదేహం

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ అర్జున్ (37) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం అతని భార్య కంటి పరీక్షలు చేయించుకోవడానికి ఇద్దరు కుమారులతో కలిసి నిర్మల్ వెళ్లింది. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రాథోడ్ వేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి: నూతనంగా ఎన్నికైన నాగోబా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఆలయ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం వెంకట్‌రావ్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి, మెస్రం వంశీయులు నాగ్‌నాథ్, దాదారావ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్ రక్తనిధికి రాష్ట్రస్థాయి అవార్డు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌కు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టి శాక్స్) రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. బ్లడ్ బ్యాంక్ ద్వారా సేకరించిన రక్తం యూనిట్లు, రోగులకు అందించిన సేవలకు గానూ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఈ బ్లడ్‌బ్యాంక్ నిలిచింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే వేడుకల్లో బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డా.సుధాకర్ ఈ అవార్డు అందుకోనున్నారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్



ఎస్సైకి సర్టిఫికెట్లు అందజేస్తున్న కండక్టర్

బోథ్: బస్సులో మర్చిపోయిన బ్యాగును బోథ్ పోలీస్ స్టేషన్‌లో అందించిన కండక్టర్ నిజాయతీ చాటుకున్నాడు. మండలంలోని కరత్వాడకు చెందిన సుప్రియ శనివారం నిర్మల్ నుండి బోథ్‌కు బస్సులో వచ్చింది. బస్సులోనే బ్యాగు మర్చిపోవడంతో గమనించిన కండక్టర్ బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు అప్పగించాడు. అందులో సుప్రియకు చెందిన సర్టిఫికెట్లు ఉన్నాయి. విషయాన్ని కరత్వాడలోని సుప్రియ కుటుంబ సభ్యులకు అందించి బ్యాగును అప్పగించారు. కండక్టర్‌ను ఎస్సై అభినందించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- జిల్లా జడ్జి ప్రభాకరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

కైలాస్‌నగర్: క్షణికావేశంలో నేరం చేసి జైలు జీవితం గడుపుతున్నవారు శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా జైలులో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జైలులోని ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా న్యాయసహాయం అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఖైదీలు వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ బి.సౌజన్య, జైలు సూపరింటెండెంట్ అశోక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, హుస్సేన్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, ముజాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- జిల్లా కేంద్రంలో 2కే ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ఆర్టీఏ కార్యాలయం వరకు 2 కే రన్ ర్యాలీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రవీందర్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఎంవీఐలు కె.రవీందర్, ప్రదీప్ గౌడ్, అశ్వంత్ కుమార్, ఏఎంవీఐలు విద్యాధర రెడ్డి, ప్రత్యూష, హరేంద్ర కుమార్, వినయ్, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ప్రణయ్ కుమార్, డి సాయినాథ్, కే. ఫణీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

వ్యవసాయరంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

- అన్నదాతకు చేయూతనివ్వడంలో సర్కారు విఫలం
- సీఎం రేవంత్‌రెడ్డికి ఉపసైన్యంలా బీజేపీ నేతలు
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్ రెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించి అన్నదాతల మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండదండగా నిలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారిని విస్మరిస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలోని 50వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో కొర్టా– చనాఖా బ్యారేజీను నిర్మించి ట్రయల్ రన్ కూడా చేపట్టిందన్నారు. ఈ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నీటిని అందించేలా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం రైతులపై వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అలాగే రైతుబంధులోనూ కోత పెడుతున్నారని, పథకాల అమలుపై కాలయాపన తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డికి ఉపసైన్యంలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల వేళ రైతాంగానికి ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేవరకు తమ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు జోగురామన్న, పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి అప్పగించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్: ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి అప్పగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి భీమ్‌రావు, సర్వే భీమ్‌రావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట శనివారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీ కింద ఇచ్చే నిధులను ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి ముత్యాల ఆశన్న, ఎస్ఆర్ రెడ్డి, నాగన్న, దత్తు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయుల బస



మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 28న నిర్వహించనున్న నాగోబా మహాపూజకు అవసరమైన పవిత్ర గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు శుక్రవారం రాత్రి కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో గల మర్రిచెట్టు వద్ద బస చేశారు. శనివారం రాత్రి పటేల్ కితకు చెందిన మెస్రం వంశీయులకు సంప్రదాయ వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. నాగోబా మురాడి నుండి సంప్రదాయ వాయిద్యాల మధ్య పటేల్ కితకు చెందిన మెస్రం వంశీయులకు అతిథి మర్యాదలు చేశారు. రాత్రి ప్రధాన్ సమాజ్ పెద్ద ఆధ్వర్యంలో మెస్రం వంశీయులకు నాగోబా చరిత్రను బోధించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పెద్దలు చిన్ను పటేల్, బాదిరావ్, కోసు కటోడ, కోసేరావ్ కటోడ, హనుమంత్‌రావ్, దాదారావ్, తిరుపతి, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. సదరు బాలిక శనివారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగిరాలేదు. బంధువుల ఇండ్లలో, చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక సోదరుని ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జిల్లావ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులు, నాయకులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఓటు ప్రాముఖ్యత గురించి వక్తలు వివరించారు. వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్


బోథ్‌లో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు


తలమడుగులో ర్యాలీ


ఆదిలాబాద్‌రూరల్: కచికంటి గ్రామంలో..


ఆదిలాబాద్: ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్


నార్నూర్: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ రాజలింగు


తాంసి: పొన్నారి పాఠశాలలో..

క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తుల వెల్లువ


దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

ఆదిలాబాద్‌రూరల్: రైతు భరోసా పథకానికి రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. 2024 తర్వాత 1 జనవరి 2025 వరకు నూతనంగా వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్న కొందరు రైతుల పేర్లు అందులో లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. మండల వ్యవసాయ అధికారులు శనివారం దరఖాస్తులు స్వీకరించారు. ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం రైతులతో సందడిగా మారింది. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ఏఈవోలు పేర్కొన్నారు.

పత్తి రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న పత్తిరైతులు

బేల: మండలకేంద్రంలోని ఆశాపుర జిన్నింగ్ శనివారం సాయంత్రం 6 తర్వాత సీసీఐ పత్తి కొనుగోళ్లు అర్ధంతరంగా నిలిచాయి. సర్వర్ లేకుండా కొనుగోళ్లు చేయరాదని సీపీవో నిరాకరించారు. దీంతో వారు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. మరో 32 వాహనాల పత్తి కొనుగోళ్లు చేయాల్సి ఉంది. సోమవారం తర్వాతే కొనుగోళ్లకు వీలుందని, వాహనాలను జిన్నింగ్ లోపల పెట్టుకోవాలని సీపీవో తెలిపారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న తహసీల్దార్ రఘునాథ్‌రావు, ఎస్సై దివ్య భారతిలు అక్కడికి చేరుకుని వారిని సముదాయించినా వినలేదు. ఆందోళన కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ వెళ్లిపోగా, ఎస్సై.. ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు.

టై, బెల్టు, ఐడీకార్డులు పంపిణీ

కై లాస్‌నగర్(జైనథ్): ఐడి కోసం మా వంతు కా ర్యక్రమంలో భాగంగా జైనథ్ మండలం కెనాల్ మేడిగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రజక ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ము స్కు స్వామి శనివారం టై, బెల్ట్, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సంజీవరె డ్డి, పాఠశాల హెచ్‌ఎం వినోద్‌రావు, ఉపాధ్యాయు డు చిల్క సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ

నేరడిగొండ: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) వైసి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చింతగూడ సబ్‌సెంటర్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆ యన వెంట వైద్య సిబ్బంది ప్రీతి, సచిన్, హెచ్‌ఈఓ పవార్ రవీందర్, సంతోష్, స్వర్ణలత, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, సీహెచ్‌ఓ భీంరాజ్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశ కార్యకర్త గంగామణి ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కల్లుగీత సహకార సంఘం కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.నర్సాగౌడ్, కార్యదర్శిగా ఎ.సురేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆర్.సంజీవ్‌గౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా నర్సమ్మ, ఎస్.భగీరథ బాయిలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సహకార శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ శ్వేత తెలిపారు. ఈ కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. సభ్యుల సమస్యలు పరిష్కరించడంతోపాటు సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని నూతన జిల్లా అధ్యక్షుడు నర్సాగౌడ్ తెలిపారు. అనంతరం ఎన్నికై న కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

నియామకం

కైలాస్‌నగర్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని రద్దు చేసినందున, నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహణ కోసం సంఘ సభ్యులను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. కన్వీనర్‌గా జి.ఆశన్న, కార్యదర్శిగా ఎస్.నర్సింగ్, డైరెక్టర్లుగా బి.సునీల్, జి.శంకర్, మహ్మద్ జాకీర్‌లను నియమించినట్లుగా పేర్కొన్నారు. జిల్లాలోని నాల్గో తరగతి ఉద్యోగుల నుంచి సభ్యత్వాలను నమోదు చేసి, ఓటర్ల జాబితా రూపొందించి కేంద్ర సంఘానికి నివేదించే బాధ్యతలను వారికి అప్పగించినట్లుగా పేర్కొన్నారు.

స్పౌజ్ టీచర్లకు పోస్టింగ్‌లు

కైలాస్‌నగర్: గత ప్రభుత్వం తెచ్చిన జీవో 317 కారణంగా ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎట్టకేలకు ఊరట లభించింది. నాలుగేళ్ల పాటు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహించిన వారిని స్పౌజ్ కేటగిరీ కింద వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది. కుమురంభీం జిల్లా నుంచి 30 మంది, మంచిర్యాల నుంచి ఒకరు, నిర్మల్ నుంచి ఏడుగురు చొప్పున 38 మంది ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇందులో 31 మంది ఎస్జీటీలు ఉండగా, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరికి శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ప్రణీత ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ స్పౌజ్ పనిచేసే ప్రాంతానికి సమీపంలోని పాఠశాలల్లో వారికి పోస్టింగ్‌లు కల్పించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జాతీయ హెల్త్‌మిషన్ పరిధిలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా భర్తీ చేయనున్న జిల్లా ప్రోగ్రాం అధికారి (డీపీవో)పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, పూర్తి వివరాలను కార్యాలయ నోటీసుబోర్డుతో పాటు www.adilabad.telangana.gov.in లోనూ అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 27 నుంచి 31వరకు పని దినాల్లో సాయంత్రం ఐదు గంటల వరకు అందజేయవచ్చని సూచించారు. ఎంపికైన వారికి రూ.35వేల వేతనం అందించనున్నట్లు వెల్లడించారు.

నేటితో ముగియనున్న కౌన్సిల్ గడువు

ఇంకా ఖరారు కాని స్పెషలాఫీసర్

2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల వారీగా గెలుపొందిన కౌన్సిలర్ల వివరాలు

బీఆర్‌ఎస్: 24	బీజేపీ : 11
కాంగ్రెస్: 05	ఎంఐఎం: 05
స్వతంత్రులు : 04	


ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కై లాస్‌నగర్: జిల్లాలోని ఏకై క మున్సిపాలిటీ ఆదిలాబాద్. నేటితో పాలకవర్గ గడువు ముగియనుంది. కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారి పాలన షురూ కానుంది. ఇప్పటికే జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 11నెలలుగా, మండల, జిల్లా పరిషత్‌లోనూ ఆరు నెలలుగా స్పెషలాఫీసర్ల పాలన కొనసాగుతుండగా తాజాగా మున్సిపల్‌లోనూ రంగం సిద్ధమైంది. గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా ఇప్పటివరకు ఎవరిని ఖరారు చేయలేదు.

2018లో పునర్విభజన

గతంలో మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండేవి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 2018లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పునర్విభజన చేసింది. మావల మేజర్ గ్రామ పంచాయతీలోని దస్నాపూర్, దోబీకాలనీ, పిట్టలవాడ, రాంనగర్, టీచర్స్‌కాలనీ, సుభాష్‌నగర్, కోజాకాలనీ, కైలాస్‌నగర్ వార్డులతో పాటు బట్టిసావర్‌గాం గ్రామ పంచాయతీలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్, అనుకుంట, బంగారిగూడ గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేసింది. బల్దియా పరిధి పెరగడంతో తదనుగుణంగా మరో తొమ్మిది వార్డులను కొత్తగా ఏర్పాటు చేసింది. దీంతో వార్డుల సంఖ్య 49కి చేరింది. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో బీఆర్‌ఎస్ సత్తా చాటి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. అదే నెల 27న బాధ్యతలు స్వీకరించారు. 2020లో ప్రబలిన కోవిడ్ కారణంగా కౌన్సిల్ ఏడాదిన్నర పాలన దాంతోనే గడిచిపోయింది. ఆశించిన స్థాయిలో పట్టణాభివృద్ధి సాధ్యపడలేదు. గతేడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఏడాదిగా ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి ఆశించిన నిధులు సమకూరలేదు. ఈ కారణంగా అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగింది. చాలా వార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచి కౌన్సిల్ తీరును ప్రశ్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే సభ్యులు పదవీని ముగించబోతున్నారు. మారిన రాజకీయ పరిస్థితులతో పలువురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరడం గమనార్హం.

ఎన్నికలకు అవకాశం లేక..

మున్సిపల్ కౌన్సిల్ గడువు ఆదివారంతో ముగియనుంది. గణతంత్ర వేడుకల్లో పాల్గొనే సభ్యులు మరుసటి రోజు నుంచి మాజీలు కానున్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి కానుంది. మున్సిపాలిటీ కంటే ముందే పాలకవర్గాల గడువు ముగిసిన గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు ఆరు నెలల సమయం పట్టే అవకాశముంది. ఈ ఎన్నికలు పూర్తయ్యాకే మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. ఇందుకు మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పటి వరకు ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగనుంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ గ్రేడ్–1 స్థాయి కలిగి ఉండటంతో ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరిని నియమించలేదు. అయితే వీడ్కోలు సమావేశమైనా నిర్వహిస్తారా లేక అలాగే సాగనంపుతారా అనే దానిపై కౌన్సిలర్లలో చర్చ సాగుతోంది.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


విదార్థులతో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టేజీను శనివారం ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు నూతన స్టేజీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తర్వాత విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీ ఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, మాజీ జెడ్పీటీసీ జహీర్, మాజీ సర్పంచులు అశోక్, మహేందర్, కరణ్, పవన్, హెచ్‌ఎం అంబరావు పాల్గొన్నారు.

'గిరి'గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తా

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పట్బుటితండా గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ.70లక్షలతో భూమిపూజ చేయగా, శనివారం పనులను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుగ్గారం(బి)లో శనివారం నిర్వహించిన బుగ్గారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలకు సొంత డబ్బులతో ప్రథమ బహుమతి రూ.25 వేలు అందజేశారు. ద్వితీయ బహుమతి ప్రధాత రాథోడ్ సురేందర్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, మాజీ సర్పంచులు మహేందర్, కరణ్, పవన్, బాబులాల్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉట్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈనెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగిన ఆరు రాష్ట్రాల దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు టి.మౌనిక, ఎ.జ్యోతిక, గైడ్ టీచర్ విద్యారాణి పాల్గొన్నారు. నేచురల్ ఫుడ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ అనిమియా అనే అంశంపై బహుమతి సాధించి నాలుగవ స్థానంలో నిలిచారు. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమఃశివాయ, విశ్వేశ్వరయ్య మ్యూజియం డైరెక్టర్ గురునాథం, పాఠశాల విద్యా డైరెక్టర్ ప్రియతరిసినై, జాయింట్ డైరెక్టర్ శివగామి వారికి బహుమతులు అందజేశారు. కలెక్టర్ రాజర్షిషా, జిల్లా సైన్స్ అధికారి రఘురమణలు వారిని అభినందించారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం సీనియర్ పురుషుల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉష్కం రఘుపతి, జాబాడె రాష్ట్రపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 85 కిలోల లోపువారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 1 గంటలకు స్టేడియంలో రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు సెల్ 77020 35200 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం

బోథ్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులు


నివాళులర్పిస్తున్న పర్ధాన్ సమాజ్ నాయకులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు శనివారం నివాళులర్పించారు. అనంతరం సమావేశమై పర్ధాన్ సమాజ్ ఐక్యత, అభివృద్ధిపై చర్చించారు. వచ్చేనెల 12న మాఘమాస పౌర్ణమి రోజున పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుక లింగో జయంతిని గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. జిల్లా స్థాయిలో పర్ధాన్ సమాజ్ పెద్దలు చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మెస్రం వేశవ్, సంయుక్త కార్యదర్శి ఆర్క శేషరావ్, సహాయ కార్యదర్శి పెందోర్ అంకుష్, జిల్లా సలహాదారులు మెస్రం శేషనారాయణ్, మెస్రం ఆనంద్‌రావ్, సమాజ్ నాయకులు గేడం భరత్, సోయం మురహరి, గేడం భారతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణం, రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. అనంతరం పార్టీ సంఘటన మంత్రి చంద్రశేఖర్‌ను కలిశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ ముస్తాపురే ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

తలమడుగు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిపై హెచ్‌ఎం శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సదరు టీచర్ లీవ్ తీసుకోగా, మెడికల్ సర్టిఫికెట్ తీసుకురాపోవడంతో ఇటీవల కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంక్వైరీ టీం పాఠశాలకు రాగా, వారి ఎదుట హెచ్‌ఎంపై టీచర్ దురుసుగా వ్యవహరించారు. కాగా, ఈ విషయమై ఎస్సై అంజమ్మను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఖందేవ్ ఆలయంలో పూజలు

నార్నూర్: తొడసం వంశీయుల ఆరాధ్యదైవం మండల కేంద్రంలోని ఖందేవ్ ఆలయంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ జాదవ్ శ్రీరామ్‌నాయక్, బీఆర్‌ఎస్ నేతలు శనివారం పూజలు చేశారు. ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాశీం తదితరులు ఉన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్లో ప్రవేశాలు

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. బాలికలు 30, బాలురకు 30 ఖాళీల సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుము రూ.100 ఉంటుందని, ప్రవేశపరీక్ష మార్చి 16న ఉంటుందని తెలిపారు.

సన్మానం

ఇచ్చోడ: సీఆర్టీల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జాదవ్ వినంత్‌రావుకు శనివారం మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో సన్మానించారు. హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

బోథ్: కనుగుట్ట జెడ్పీ సెకండరీ పాఠశాలకు పూర్వ విద్యార్థి గడ్డల నారాయణ శనివారం మైక్‌సెట్‌ను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా మైక్‌సెట్ అందించినట్లు తెలిపారు. ఎంఈవో పోశెట్టి, నాయకులు చంటి, ఇదాపు నారాయణ, ఇదాపు పోశెట్టి, వీడీసీ చైర్మన్ రవి కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సూపర్‌వైజర్, బీఎల్వోకు అవార్డు

సిరికొండ: నూతన ఓటర్లను చేర్చి ఉత్తమ ప్రదర్శన చేసిన సిరికొండ మండల ఎన్నికల సూపర్‌వైజర్ ఉపేందర్, బీఎల్వో మౌనజను జెడ్పీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి శనివారం అవార్డు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని అవార్డును అందించారు.

ఉద్యోగానికి ఎంపిక

బోథ్: ధన్నూర్ గ్రామానికి చెందిన రవితేజ ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈనెల 24న టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. గ్రామస్తులు, స్నేహితులు ఆయన్ను అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

తలమడుగు: ఎడ్లబండిపై నుంచి పడి గాయపడిన రుయ్యాడి గ్రామానికి చెందిన బొజ్జ రాజుకు సామజిక కార్యకర్త ముడుపు మౌనిశ్‌రెడ్డి శనివారం రూ.11 వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సహకార బ్యాంక్ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

బేల: జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని చప్రాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు ఉండవు

బేల: మండలకేంద్రంలోని ఆశాపుర జిన్నింగ్ మిల్లులో యంత్రాలు మరమ్మతు చేయాల్సి ఉండడం, పత్తి నిల్వలు ఎక్కువైనందున ఈనెల 27నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు ఉండవని జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు. పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పత్తి రైతులు గమనించాలని కోరారు.

ఉట్నూర్‌లో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'

ఉట్నూర్‌రూరల్: స్థానిక శ్రీపులాజీ బాబా కళాశాలలో శనివారం బీజేపీ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగంపై విద్యార్థులకు నిర్వహించిన చర్చాగోష్ఠిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్ రాథోడ్ పాల్గొన్నారు. నాయకులు రమేశ్ ధన్‌లాల్, శేషరావు, రాజేశ్వర్, ఆశన్న, సతీశ్, వెంకటేశ్, రవి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నార్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్‌ఎం నరేంద్రరెడ్డి, పార్టీ నాయకులు వహీద్, రోహిత్, అంజాత్, ఉట్నూర్ అధ్యక్షుడు జాహెద్, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గంగాజలాన్ని స్వీకరించాలి

ఆదిలాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో కుంభమేళాలో పవిత్ర గంగాజలాన్ని భక్తులు స్వీకరించాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామి అన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మఠంలో అందిస్తున్న ఉచిత గంగాజల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని శనివారం భక్తులకు గంగాజలాన్ని పంపిణీ చేశారు.

మంగ్ కులస్తులకు కుల ధ్రువీకరణపత్రం జారీచేయాలి

నార్నూర్: మాంగ్ కులస్తులకు తహసీల్దార్ ద్వారానే కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గాదిగూడ తహసీల్దార్ విజయనందంకు శనివారం మాంగ్ సమాజ్ పెద్దలు వినతిపత్రం అందజేశారు. కాంబ్లే నాగనాథ్, దయానంద్, కలవలే దత్త, సంజీవ్ మంగ్ ఉన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలపై అవగాహన కల్పించాలి

బజార్‌హత్నూర్: విద్యార్థులకు చదువుతోపాటు రాజ్యాంగ వ్యవస్థలపై అవగాహన కల్పించాలని ఎంఈవో కిషన్ గుప్తా తెలిపారు. మండల కేంద్రంలోని కురుక్షేత్ర ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎస్సై అప్పారావ్, మాజీ వైస్ఎంపీపీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సబ్బిడి నవీన్, శంకర్, మణికంఠ, ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారు'

బోథ్: పేదలకు పథకాలకు చేరువ చేసేందుకు నిర్వహించిన గ్రామసభలను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం గ్రామాభివృద్ధిని అడ్డుకోవడమేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం సొనాలలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న సొనాలలో బోథ్ ఎమ్మెల్యే తమ కార్యకర్తలతో గ్రామసభను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గ్రామ అధ్యక్షుడు అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

సిరికొండ: మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామంలో పక్కా సమాచారంతో జాదవ్ శ్రీ ఇంటిని శనివారం తనిఖీ చేసి నిల్వ ఉంచిన అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శివరాం తెలిపారు. మద్యం, పటిక బెల్లాన్ని స్వాధీనం స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.